సాక్షి
అనంతపురం
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



బీటీపీకి పోటెత్తిన వరద

బ్రహ్మసముద్రం మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్ట్‌కి వరద పోటెత్తింది. గురువారం నాటికి 1,648 అడుగులకు నీరు చేరింది.



కిలో టమాట రూ.60

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ.35, సరాసరిన రూ.45 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
32.5°/21.9°

జిల్లా అంతటా గురువారం మధ్యాహ్నం వరకు తుపాను వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ఉక్కపోత అధికమైంది. ఆకాశం మేఘావృతమై జిల్లా అంతటా జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఉదయం వాన... మధ్యాహ్నం వేడి



అనంతపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా గురువారం అనూహ్య వాతావరణం నెలకొంది. ఉదయం ఎడతెరపి లేకుండా జడివానతో వరుణుడు భయపెట్టగా.. మధ్యాహ్నం సూరీడి ప్రతాపంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి మొదలైన జడివాన ఉదయం 11 గంటల వరకు తెరపివ్వకుండా కురిసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. 30 నుంచి 32 డిగ్రీలతో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనంతపురం, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, పామిడి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, విడపనకల్లు, ఆత్మకూరు, కణేకల్లు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 20 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అక్టోబర్ సాధారణ వర్షపాతం 100.9 మి.మీ కాగా ఇప్పటికే 85 మి.మీ నమోదైంది. ఈ వర్షాలకు ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, పత్తి, ఆముదం, కొర్ర, వరి, కంది పంటలకు నష్టం కలుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట తొలగింపు, నూర్పిడికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. అరటి, బొప్పాయి, టమాట, ఇతర కూరగాయల పంటలకు నష్టంగా మారినట్లు అంచనా వేస్తున్నారు. రబీలో పప్పుశనగ సాగు చేసుకునేందుకు ఈ వర్షాలు అనుకూలమని అధికారులు తెలిపారు. శుక్రవారం కూడా వర్షం పడే సూచనలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

‘ఓపెన్’ ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు గడువు ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 25లోపు దరఖాస్తు చేసుకోవాలని, రూ. 200 అపరాధ రుసుంతో 26 నుంచి 29 వరకు, రూ. 500 అపరాధ రుసుంతో 30,31 తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెస్సీలో స్పాట్ అడ్మిషన్లు



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆర్. కిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీపీజీసెట్–2024లో అర్హత సాధించి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21న జేఎన్ టీయూ అనంతపురం పాలక భవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని సూచించారు. ఇప్పటిదాకా ఎక్కడా అడ్మిషన్లు తీసుకోకుండా ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

పన్నుపోటు.. ఫుల్ రేటు

మద్యం లెక్కల్లో మతలబు

- రకరకాల ట్యాక్సులతో భయపెడుతున్న సర్కారు
- రూ.6.66 లక్షల మద్యానికి రూ.4.61 లక్షల ఏఆర్ఈటీ ట్యాక్సు
- ఎక్సైజ్ డ్యూటీ పేరుతో భారీగా వడ్డన
- అదనంగా స్పెషల్ మార్జిన్, వ్యాట్, ఎస్ఎంపీ, పీడీ ట్యాక్సులు
- ఇన్‌వాయిస్ విలువతో పోలిస్తే నెట్‌వ్యాల్యూ 80 శాతం ఎక్కువ!
- లెక్కలు అంతుచిక్కక తలలు పట్టుకుంటున్న లిక్కర్ గోడౌన్ అధికారులు

ఓ మద్యం షాపు నిర్వాహకుడి సరుకు ఇన్‌వాయిస్ ఇలా..

కేటగిరీ	విలువ
ఇన్‌వాయిస్ విలువ	రూ.6,66,815
స్పెషల్ మార్జిన్	రూ.21,832.68
ఏఆర్ఈటీ టాక్స్	రూ.4,61,714
టోటల్ ఈడీ	రూ.94,468.45
టోటల్ వ్యాట్	రూ.30,222.67
టోటల్ రేట్ ఆఫ్ ఎస్ఎంపీ	రూ.3,32,448.05
టోటల్ పీడీ	రూ.2,49,118.23
టీసీఎస్	రూ.11,565
మొత్తం సరుకు విలువ	రూ.11,67,971.4



అనంతపురంలోని హౌసింగ్ బోర్డు వైన్‌షాపులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మద్యం లెక్కల్లో సర్కారు మతలబు చేస్తోంది. రకరకాల ట్యాక్సులతో భయపెడుతోంది. బుధవారం రాత్రి పొద్దుపోయే వరకూ అనంతపురంలోని లిక్కర్ గోడౌన్ నుంచి శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని మద్యం షాపులకు లిక్కర్ సరఫరా చేశారు. ఇందులో ఒక మద్యం షాపు నిర్వాహకుడికి ఇచ్చిన ఇన్‌వాయిస్ కాపీలు పరిశీలిస్తే కళ్లు తేలేసినంత పనైంది. ఇన్‌వాయిస్ వ్యాల్యూ రూ.6.66 లక్షలుగా ఉంటే, అన్ని ట్యాక్సులూ కలుపుకుని నెట్ వ్యాల్యూ రూ.11.67 లక్షల వరకూ వేశారు. బీర్‌లు, విస్కీ, బ్రాందీ ఇలా అన్ని రకాల బ్రాండ్‌ల పైనా ఇన్‌వాయిస్ వ్యాల్యూతో కలుపుకుంటే మరో 80 శాతానికి పైగా నెట్ వ్యాల్యూ అధికంగా ఉంది. ఇండెంట్ ఇచ్చే లిక్కర్ గోడౌన్ అధికారులే ట్యాక్సులు, లెక్కల పట్టికలు చూసి ఆశ్చర్యపోయారు. ట్యాక్సులు దేనికి ఎంతనో తమకే అర్థం కావడం లేదంటూ తలలు పట్టుకున్నారు.

పొంతనే లేదు..

వాస్తవానికి ఇన్‌వాయిస్ వ్యాల్యూ ప్రకారం చూస్తే ఒక బీరు బాటిల్‌ను రూ.230కే విక్రయించాలి. అయితే, ఈ ధరకు, వినియోగదారుడికి చేరే ధరకు పొంతనే ఉండటం లేదు. రకరకాల ట్యాక్సులు వేయడంతో రూ.280 వరకూ కంపెనీని బట్టి ధరలు నిర్ణయించారు. విస్కీ, బ్రాందీ ధరలు కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో దేని రేటు ఎంతో గోడౌన్ అధికారులకు అంతుచిక్కలేదు. ‘దీనిపై మాకు అవగాహన లేదు. కోడ్ నంబర్ ఎంటర్ చేస్తే ధర వస్తుంది. అదే వేస్తున్నాం’ అంటూ సమాధానం ఇస్తున్నారు.

దిగిపోతోన్న కిక్కు..

పెరిగిన ధరలు మద్యంప్రియులకు ఎక్కిన కిక్కు క్షణాల్లో దిగిపోయేలా చేస్తున్నాయి. ధర తగ్గిస్తాం, నాణ్యమైన మద్యం అందిస్తాం, రూ.99కే చీప్ లిక్కర్ ఇస్తాం అంటూ చెప్పిన చంద్రబాబు నిలువునా ముంచేశారని మందుబాబులు వాపోతున్నారు. ఈ నెల 15 నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. ధరలు తగ్గి ఉంటాయని 15వ తేదీ రాత్రినుంచే మద్యంప్రియులు షాపులపై ఎగబడ్డారు. చివరకు చూస్తే పాత మద్యం బాటిళ్లే. అందులోనూ పాత ధరల కంటే పది రూపాయలు ఎక్కువగా ఉండటం చూసి ఘొల్లుమన్నారు.

రేట్లు తగ్గించడమంటే ఇదేనా?



మద్యం రేట్లు ఎందుకు తగ్గించలేదంటూ లిక్కర్ షాపు సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న వెంకటస్వామి

చంద్రబాబు సర్కారు మోసంపై గురువారం అనంతపురంలోని ఎస్ఆర్ వైన్స్ (షాపు నం.14) వద్ద నిర్వాహకులతో వెంకటస్వామి అనే వ్యక్తి వాగ్వాదానికి దిగారు. ‘ఎన్నికల ముందేమో రేట్లు తగ్గిస్తామన్నారు. నాణ్యమైన మద్యం ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఏమీ చేయలేదు. అలవిగాని హామీలు ఇచ్చి మోసం చేశార’ని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా షాపు నిర్వాహకులు కిమ్మనలేదు.

ఇన్‌వాయిస్, ఇండెంట్‌కు తేడా ఉంటుంది

వాస్తవానికి ఇన్‌వాయిస్ వ్యాల్యూకు, ఇండెంట్ వ్యాల్యూకు తేడా ఉంటుంది. ట్యాక్సుల రూపంలోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కానీ దీనిపై మాకు పెద్దగా అవగాహన లేదు.విజయవాడలో అధికారులు నిర్ణయించిన రేట్లనే మేమిక్కడ అమలు చేస్తాం.

– వేణుగోపాల్‌రెడ్డి, లిక్కర్ గోడౌన్ అధికారి, అనంతపురం

సొసైటీల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయండి

- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్, జేసీ శివనారాయణశర్మ



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం అగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. గురువారం స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయ హాలులో సీఈఓ కె.సురేఖారాణితో కలిసి బ్రాంచి మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందాలంటే కంప్యూటరీకరణ ముఖ్యమన్నారు. బ్యాంకు పురోభివృద్ధికి డిపాజిట్ల సేకరణపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం అమలులోకి తెచ్చిన 444 రోజుల డిపాజిట్ పథకంలో వడ్డీ రేటు 7.85 శాతం నుంచి 8.35 శాతానికి పెంచినందున అవగాహన కల్పించాలని ఆదేశించారు. గడువు మీరిన రుణబకాయిల వసూళ్లకు లీగల్ కవరేజీ పూర్తి చేసి నిరర్థక ఆస్తులను గణనీయంగా రికవరీ చేయాలన్నారు. మహిళా సంఘాలు, పీఎం స్వనిధి, సీహెచ్‌సీలు, తోడు కార్యక్రమాలకు సంబంధించి బకాయిలు వసూలు చేయాలన్నారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాల స్థితిగతులు, ఖాతాదారులకు బ్యాంకు అందిస్తున్న ఆధునిక సేవల గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, నాబార్డు డీడీఎం అనురాధ, డీఎల్‌సీఓ ప్రభాకరరెడ్డి, డీఆర్ఓ ఎస్‌డీ సూర్యనారాయణ, డీజీఎంలు రామ్‌ప్రసాద్, సుఖదేవబాబు, విజయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- వర్షాల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్
- ఆల్ ఇండియా రేడియోలో ‘ఫోన్‌ఇన్’



ఆల్ ఇండియా రేడియో ఫోన్ ఇన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యలు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉంటాయని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో ఆకాశవాణి అనంత మిత్ర ఫోన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజలతో మాట్లాడి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వర్షాల కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. పలువురు రైతులు, ప్రజలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటికి కలెక్టర్ సమాధానమిస్తూ... పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, ఏడీ ఫిరోజ్ ఖాన్, ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ నాగేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్ని...

- అనంతపురం సాయినగర్‌కు చెందిన సత్యనారాయణమ్మ మాట్లాడుతూ సాయినగర్‌లోని తన స్థలాన్ని ఇతరులు ఆక్రమించారని చెప్పారు. అధికారులు సర్వే చేసి స్థలం తనదేనని నిర్ధారించిన తరువాత కూడా ఆక్రమణదారులు వెనక్కి తగ్గలేదన్నారు. న్యాయం చేయాలని కోరారు.
- శింగనమల మండలం శివపురం గ్రామానికి చెందిన రైతు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా దానిమ్మ, తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపాలెంలో మునగ పంటల రైతులు పూర్తిగా నష్టపోయారని, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- గుత్తి రోడ్డులోని తడకలేరు బ్రిడ్జిలో కొట్టాలపల్లి వద్ద వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిందని అనంతపురం నగరానికి చెందిన దేవానందం చెప్పారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు మరమ్మతు చేయించాలన్నారు.
- నార్పల మండలానికి చెందిన ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి కురగానిపల్లి గ్రామానికి ఉన్న నాలుగు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉందని చెప్పారు. గ్రామంలో పాడిపశువులు ఉన్నాయని, ప్రతి రోజూ దాదాపు వెయ్యిలీటర్ల పాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రోడ్డు మరమ్మతు చేయించాలని కోరారు.
- వర్షం కురిస్తే తమ గ్రామంలోని ఈశ్వరుని గుడి నుంచి సుబ్బరాయుడు గుడికి వెళ్లే దారి పూర్తిగా నీటితో నిండి పోతోందని గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన గోపాల్ తెలిపారు. సమస్య పరిష్కరించాలని కోరారు.
- ఇప్పేరు గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఇప్పేరు చెరువుకు హంద్రీ–నీవా నుంచి నీరు విడుదల చేయడంతో బ్యాక్ వాటర్ వల్ల తమ పొలంలోని చీనీ చెట్లు మునిగిపోయాయని, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాదే సర్కారు.. మా వాళ్లకే పోస్టులు!

- ‘కేజీబీవీ’ నాన్ టీచింగ్ పోస్టులకు ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు
- తలలు పట్టుకుంటున్న సమగ్రశిక్ష అధికారులు
- రంగంలోకి వసూల్ రాజాలు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏపీసీ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన చందంగా తయారవుతోంది కేజీబీవీ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో అధికారుల పరిస్థితి. తాము చెప్పిన వారికే పోస్టులు ఇవ్వాలంటూ ప్రజాప్రతినిధుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్, నాన్ టీచింగ్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. జిల్లాలో 41 టీచింగ్, 98 నాన్‌టీచింగ్ పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. టీచింగ్ పోస్టులతో పాటు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, వార్డెన్, అకౌంటెంట్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, నాన్ టీచింగ్ (టైప్–3,4) పోస్టులకు ఆయా మండలాల్లో ఎంఈఓల వద్ద దరఖాస్తు చేసుకున్నారు. టీచింగ్ పోస్టులను విద్యార్హత, మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఈ క్రమంలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ అధికారులకు తలనొప్పిగా మారుతోంది.

సిఫార్సు లేఖలతో అభ్యర్థులు

టీచింగ్ పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తుండటంతో నాన్ టీజింగ్ పోస్టులు తమవారికి ఇప్పించేందుకు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఇప్పటికే చాలామందికి సిఫార్సు లేఖలు ఇవ్వగా వాటిని తీసుకుని అధికారులకు అందజేస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు ఫోన్లు చేసి మరీ చెబుతున్నారు. సందట్లో సడేమియా లాగా కొందరు అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు వసూల్ రాజాల అవతారం ఎత్తారు. ఒక్కో పోస్టుకు ఒక్కో ధర ఫిక్స్ చేసినట్లు తెలిసింది. పోస్ట్ గ్యారంటీ పేరుతో డబ్బుల వసూళ్లకు తెర తీశారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా గురువారం సాయంత్రం సమగ్ర శిక్ష కార్యాలయానికి చేరింది. మొత్తం 68 పోస్టులకు గాను 1,877 దరఖాస్తులు వచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించిన అధికారులు అర్హులైన అభ్యర్థులకు ఫోన్ మెసేజ్ పంపారు. శుక్రవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు సూచించారు. సీఆర్టీ తెలుగు–3, ఇంగ్లిష్–4, గణితం–5, పీఎస్–4, ఎన్ఎస్–4, పీజీటీ ఇంగ్లిష్–5, పీఎస్–1, కెమిస్ట్రీ–4, బాటనీ–1, జువాలజీ–1,సివిక్స్–4, ఎంపీహెచ్‌డబ్ల్యూ–1, ఎంఎల్‌టీ–1, పీఎస్‌టీటీ–2, జీఎఫ్‌సీ–01 దరఖాస్తులు వచ్చాయి. ఇక 71 నాన్ టీచింగ్ (టైప్–3, 4) పోస్టులకు వచ్చిన దరఖాస్తులు ఎంఈఓల నుంచి సమగ్రశిక్ష కార్యాలయానికి వస్తున్నాయి. గురువారం సాయంత్రానికి 14 మండలాల నుంచి వివరాలు అందాయి.

రామాయణాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మంత్రి సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

అనంతపురం టవర్‌క్లాక్: కుటుంబ విలువలు పెంచే రామాయణాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలోని పవర్ ఆఫీసు వద్ద మహర్షి వాల్మీకి రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్‌రాజు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సెక్రటరీ పోలా భాస్కర్, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర సంచాలకులు మల్లికార్జున, కలెక్టర్ వినోద్‌కుమార్ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గుత్తి రోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ అంబికా, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ అవసరమైతే ఢిల్లీకి వెళ్లి పోరాటాలు చేసైనా, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

అంగరంగ వైభవంగా చింతల వెంకటరమణుడి కల్యాణోత్సవం

తాడిపత్రి అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా చింతల వెంకటరమణస్వామి కల్యాణోత్సవం, రథోత్సవం గురువారం కమనీయంగా సాగాయి. ముందుగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కుటుంబీకులు ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామి కల్యాణ క్రతువు ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఉత్సవ మూర్తులను పల్లకీలో ఎదుర్కోళ్లతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. వివాహ శుభ ముహూర్త ఘడియలు ఆసన్నం కాగానే అర్చకులు ఉత్సవ మూర్తుల నుదుటన ముత్యపు బాసింగాలను ధరింపజేశారు. ఉభయదార్లు పట్టువస్త్రాలను సమర్పించగా, ఆలయ ప్రధాన అర్చకులు మురళీస్వామి బృందం కల్యాణ క్రతువు ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలపై జీలకర్ర, బెల్లం పెట్టి అడ్డుగా తెరను ఏర్పాటు చేశారు. సుముహూర్తాన శాస్త్రోక్తంగా శ్రీవారిచే శ్రీదేవి, భూదేవికి మాంగల్య ధారణ గావించారు. క్రతువు జరుగుతున్నంత సేపు భక్తులు పులకించిపోయారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

- కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథం వద్ద పూజ, బలిహరణలు, సాత్త్విక బలి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో తీసుకువచ్చి రథంలో ప్రతిష్ఠించారు. పట్టణంలోని మెయిన్‌బజార్ నుంచి స్థానిక హనుమాన్ జంక్షన్ వరకూ సాగిన రథోత్సవంలో మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐలు సాయి ప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐలు ధరణీబాబు, గౌస్‌బాషా, రెడ్డప్ప బందోబస్తు నిర్వహించారు.



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



చింతల వెంకటరమణస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



భక్తుల జయజయధ్వానాల నడుమ రథోత్సవం

క్లుప్తంగా

ప్రిన్సిపల్ సెక్రెటరీ పోలా భాస్కర్‌కు స్వాగతం



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ సాదర స్వాగతం పలికారు. అనంతపురంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. అనంతరం జిల్లా సమస్యలపై వారు చర్చించారు.

13 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు...



గుజ్జల ప్రసాద్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఎంపీ సుధా

సాక్షి, చెన్నై: మానసిక రుగ్మతతో 13 ఏళ్ల క్రితం కుటుంబసభ్యులు దూరమైన వ్యక్తి... తంజావూరు కలెక్టర్ ప్రియాంక పంకజం సహకారంతో గురువారం తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాలు.. తంజావూరులో కొంతకాలంగా మానసిక రోగిగా తిరుగుతున్న ఓ యువకుడిని స్వచ్ఛంద సంస్థలు గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించాయి. ఈ క్రమంలో చికిత్స అనంతరం ఆరోగ్యవంతుడైన ఆ యువకుడి వివరాలను పునరావాస కేంద్రం అధికారులు సేకరించారు. సమాచారం అందుకున్న తంజావూరు కలెక్టర్ ప్రియాంక పంకజం.. ఆ వివరాలను బుక్కరాయసముద్రం పోలీసుల ద్వారా అతని కుటుంబానికి చేరవేశారు. ఆ యువకుడి పేరు గుజ్జల ప్రసాద్‌గా గుర్తించారు. రామాంజనేయలు, నరసమ్మ దంపతుల బిడ్డగా నిర్ధారించారు. కాగా తమ బిడ్డ ఆచూకీ 13 ఏళ్ల తర్వాత తెలియడంతో ఆ కుటుంబ సభ్యులు తంజావూరుకు బుధవారం చేరుకున్నారు. తమ బిడ్డను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్త బట్టలు, కొన్ని వస్తువులను అతడికి మైలాడుతురై ఎంపీ సుధా, కలెక్టర్ ప్రియాంక పంకజం అందజేశారు. కుటుంబీకులతో కలిసి గుజ్జల ప్రసాద్ స్వగ్రామానికి గురువారం బయలుదేరి వెళ్లాడు.

ఓటు నమోదుకు వేళాయె

- 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన
- నవంబరు 28 వరకు దరఖాస్తుల స్వీకరణ
- శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు
- డిసెంబరు 24 నాటికి దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం
- జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రకటన

ఇప్పటి వరకు దరఖాస్తుల ప్రక్రియ ఇలా..

దరఖాస్తులు	ఫారం-6	ఫారం -7	ఫారం-8
అందినవి	18,309	6,756	11,912
అనుమతించినవి	11,393	3,806	9,547
తిరస్కరించినవి	6,131	878	1,556
పరిశీలించాల్సినవి	785	1,960	771
ప్రాసెస్‌లో ఉన్నవి	---	112	38



అనంతపురం అర్బన్: ఓటరు జాబితా నమోదు, సవరణ-2025 ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఓటు నమోదు (ఫారం-6), తొలగింపు (ఫారం-7), వివరాల మార్పునకు(ఫారం-8) దరఖాస్తు చేసుకునే కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా ఎన్నికల కమిషన్ కొనసాగించడంతో పాటు వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోంది. తాజాగా కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29న ముసాయిదా జాబితా విడుదల కానుంది. అటు తరువాత నుంచి సవరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. షెడ్యూల్ ప్రకారం అన్ని రకాల దరఖాస్తులను, అభ్యంతరాలను పరిష్కరించి 2025, జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు.

షెడ్యూల్ ఇలా...

ఈ నెల 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు ఓటు నమోదు, ఓటు తొలగింపు, ఓటు వివరాల మార్పునకు సంబంధించి దరఖాస్తులను, అభ్యంతరాలను స్వీకరిస్తారు. దరఖాస్తుల స్వీకరణకు శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. దరఖాస్తులు, అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ నాటికి పరిష్కరిస్తారు. తుది ఓటరు జాబితా ప్రచురణకు ఎన్నికల కమిషన్ అనుమతిని 2025, జనవరి 1వ తేదీన తీసుకుని జాబితా ముద్రణ ప్రక్రియ నిర్వహిస్తారు.

ఇప్పటి వరకు దరఖాస్తులు ఇలా...

ఓటు నమోదు, తొలగింపు, మార్పునకు సంబంధించిన దరఖాస్తు నిరంతర ప్రక్రియ కావడంతో ఇప్పటి వరకూ అన్ని రకాల (ఫారం-6, 7, 8) దరఖాస్తులు 36,977 అందాయి. ఇందులో 24,746 దరఖాస్తులు అనుమతించారు. 8,565 దరఖాస్తులు తిరస్కరించారు. 3,516 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 150 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి.

ఫేక్ బాబు... డైవర్షన్ పాలిటిక్స్

- సజ్జల వ్యక్తిత్వ హననానికి కుట్ర
- లుక్ అవుట్ నోటీసుల జారీ చేయడం దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారుడిగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డి వ్యక్తిత్వ హననం కోసమే సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. అనంతపురంలోని తన స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త రమణతో కలసి ఆయన మాట్లాడారు. వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాలలో పనిచేసిన సమయంలో సజ్జలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి వ్యక్తిత్వం తెలిసిన వారు ఎవరూ ఆయనపై ఆరోపణలు చేయడానికి సాహించలేదన్నారు. చంద్రబాబులా అడ్డదారిన రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కాదన్నారు. జర్నలిస్టుగా సమాజాభివృద్ధికే ఆయన కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీ అభ్యున్నతికి అంకిత భావంతో పనిచేశారన్నారు. ఇంత గొప్ప వ్యక్తిత్వం ఉన్న సజ్జలను టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా చేర్చడం, విచారణకు హాజరు కావాలని గుంటూరు ఎస్పీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేయించడం దుర్మార్గమన్నారు. దీని ద్వారా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ మరోసారి బట్టబయలైందన్నారు. స్కిల్‌స్కాంలో అడ్డంగా దొరికిన బాబు... ఈ అంశంపై నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు సజ్జలపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పక్కాగా అమలు చేస్తున్న కూటమి సర్కార్‌పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

విజయవాడ నుంచే హజ్ యాత్ర

- మేయర్ వసీం డిమాండ్



మాట్లాడుతున్న అనంతపురం మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ కొనసాగిస్తూ హజ్ యాత్రను అక్కడ నుంచే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని అనంతపురం నగర మేయర్ వసీం డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ముస్లింలు హజ్ యాత్రను గతంలో హైదరాబాద్, బెంగళూరు నుంచి ప్రారంభించేవారన్నారు. సహజంగా హజ్ యాత్రకు 50 ఏళ్ల పైబడిన వారే వెళ్తుంటారని, వీరు హైదరాబాద్, బెంగళూరుకు ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ముస్లింలు తీసుకెళితే... స్పందించిన ఆయన విజయవాడ విమానాశ్రమం నుంచే హజ్‌యాత్రకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఒక్కో హజ్ యాత్రకునికి రూ.83వేల అదనపు భారం పడుతుండడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.14.50 కోట్లు నిధులు విడుదల చేసి 1,771 మంది హజ్ యాత్రికులకు ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. 2022-23లో హజ్ యాత్రకు వెళ్లిన 2,873 మందికి రూ.19.52 కోట్లు, 2024లో హజ్ యాత్రికులకు రూ.14.04 కోట్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ద్వారా విడుదల చేశారన్నారు. కాగా, 1,797 మందికి సంబంధించి రూ.9.40 కోట్లు అందాల్సి ఉన్నా.. నేటికీ విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి స్పందించి ఆ నిధులను విడుదల చేయించాలన్నారు. అదనపు ఆర్థిక భారాన్ని కూటమి ప్రభుత్వం భరిస్తోందో లేదో తెలియక ఈ సారి హజ్ యాత్రకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదన్నారు. రాష్ట్రం నుంచి కేవలం 101 మంది మాత్రమే నమోదు చేయించుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. హజ్ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ మాట్లాడుతూ... విజయవాడ నుంచి యాత్రకు వెళ్లే పద్ధతిని కొనసాగించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, నాయకులు హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి బలవన్మరణం



మృతుడు మధుసూదన్

గుంతకల్లుటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని అరవిందనగర్ రైల్వే క్వార్టర్స్ 599-బీలో మధుసూదన్ (34) రైల్వే కమర్షియల్ విభాగంలో ఓఎస్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య హేమావతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్‌ఫ్రం హోంలో భాగంగా ఇంటి వద్ద నుంచే ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. దసరా పండుగకు తన స్వగ్రామమైన ప్రొద్దుటూరు సమీపంలోని లింగాపురానికి కుటుంబసభ్యులంతా కలసి వెళ్దామని హేమావతిని మధుసూదన్ అభ్యర్థించాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో కుమార్తెతో కలసి లింగాపురానికి వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి వచ్చి యథావిధిగా తన విధులకు వెళ్లాడు. ఈ రెండు రోజుల వ్యవధిలో దంపతుల మధ్య మనస్పర్థలు పెరిగి తరచూ గొడవపడేవారు. దీంతో మనస్తాపం చెందిన మధుసూదన్ బుధవారం రాత్రి భోజనం ముగించుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుని భార్య చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం భార్య తలుపు తట్టినా తీయకపోవడంతో స్థానికుల సాయంతో బద్దలు కొట్టి లోపలకెళ్లి చూశారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి ఆమె బోరున విలపించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హేమావతి తనతో సఖ్యతగా ఉండడం లేదంటూ ఇటీవల సొంతూరికి వెళ్లినప్పుడు తన సోదరులతో మధుసూదన్ చెప్పుకుని బాధపడినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు సీఐ మనోహర్ తెలిపారు.

సాగు, తాగునీరు అందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



పులగుట్టపల్లి చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు రూరల్/పామిడి/గార్లదిన్నె/శింగనమల: చెరువుల్లో పూడిక తీయించడంతోపాటు కంపచెట్లను తొలగించి వ్యవసాయానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కూటమి సర్కార్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సాగునీటి సాధనలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర గురువారం మూడో రోజు గుంతకల్లు మండలం దోనిముక్కల, పులగుట్టపల్లి, నెలగొండ, నాగసముద్రం, అయ్యవారుపల్లి, పామిడి, గార్లదిన్నె మండలం కల్లూరు, శింగనమల మండలం తరిమెల గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలతోపాటు రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ... చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే కసాపురం తూము నుంచి పిల్ల కాలువల ద్వారా చెరువులు, చిన్నచిన్న కుంటలను కృష్ణా జలాలతో నింపితే ఏడాదికి మూడు పంటలు సాగులోకి వస్తాయన్నారు. జిల్లాలో సారవంతమైన భూములు అనేకంగా ఉన్నాయని, పాలకులు, అధికార యంత్రాంగం సరైన సాగునీటి వనరులు కల్పించకపోవడంతో ఆ భూములన్నీ బీళ్లుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ బాషా, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పామిడి మండల సీనియర్ నాయకులు పి.అనిమిరెడ్డి, నాయకులు మల్లేష్, ఆర్ ముత్యాలు, చంద్రమోహన్‌రెడ్డి, వరప్రసాద్, గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు నల్లప్ప, ఓబులేసు, లక్ష్మీదేవి, నాగమ్మ, శింగనమల మండల కార్యదర్శి భాస్కర్, కృష్ణమూర్తి, జయరాముడు పాల్గొన్నారు.

బాలికకు వేధింపులు

- తగదని హితవు పలికినందుకు ఇద్దరిపై కొడవలితో దాడి



కొడవలితో దాడి చేయడంతో చేతికి గాయాలైన దృశ్యం

గార్లదిన్నె: మైనర్ బాలికపై వేధింపులు తగదని హితవు పలికిన ఇద్దరిపై ఓ యువకుడు కొడవలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో మర్తాడుకు చెందిన గౌస్‌పీరా పరిచయం పెంచుకున్నాడు. కొంతకాలంగా తనను పెళ్లి చేసుకోవాలని గౌస్‌పీరా తరచూ వేధించేవాడు. ఇందుకు బాలిక అంగీకరించలేదు. ఈ క్రమంలో గత ఏడాది గౌస్‌పీరాకు మరో అమ్మాయితో కుటుంబసభ్యులు పెళ్లి చేశారు. అనంతపురం శివారులోని టమాట మండీలో గౌస్‌పీరా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలని మైనర్ బాలికను వేధిస్తుండడంతో విషయాన్ని కుటుంబసభ్యులతో చెప్పుకుని ఆమె బాధపడింది. దీంతో బుధవారం రాత్రి పెద్ద మనుషులను కలుపుకుని బాలిక బంధువులు గౌస్ పీరాతో మాట్లాడారు. చదువుకుంటున్న బాలికపై వేధింపులు సరికాదని హితవు పలికారు. ఆ సమయంలో రెచ్చిపోయిన గౌస్‌పీరా కొడవలితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో రాజు, బ్రహ్మయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా విచారణ చేపట్టారు. వేధింపులు నిర్ధారణ కావడంతో గౌస్‌పీరాపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాల గురువారం పోలీసులు చేపట్టారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై చైతన్య పరిచారు. అలాగే వాహన తనిఖీలు, మద్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. ఫుట్ పెట్రోలింగ్ చేపట్టి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతపై భరోసా కల్పించారు. బహిరంగ మద్యపానంపై ప్రత్యేక దృష్టి సారించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, ట్రిబుల్ రైడ్, ఓవర్ లోడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్టం మేరకు జరిమానా విధించారు. గ్రామ సభలు నిర్వహించి మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాల జోలికెళ్లొదని సూచించారు.

అర్హత కలిగిన పాడి రైతులకు గోకులాలు

- పశుశాఖ డైరెక్టరేట్ జేడీ మాధవరావు



మాట్లాడుతున్న డాక్టర్ టి.మాధవరావు

అనంతపురం అగ్రికల్చర్: ఉపాధి హామీ పథకం అనుసంధానం ద్వారా అర్హత కలిగిన చిన్న సన్నకారు పాడి రైతులకు మరిన్ని గోకులాలు మంజూరు చేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌కు చెందిన టెక్నికల్ జేడీ డాక్టర్ టి.మాధవరావు తెలిపారు. గురువారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయంలో ఆ శాఖ జేడీ డాక్టర్ జీపీ వెంటకస్వామి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్వామా పీడీ సలీంబాషా, ఎల్‌డీఎం నరసింగరావు, డీడీఏహెచ్‌లు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. డ్వామా సహకారంతో మొదటి విడతగా మండలానికి 10 గోకులాలు చొప్పున మంజూరు చేశామన్నారు. వీటిని త్వరలో మొదలు పెట్టాలని ఆదేశించారు. ఇంకా అర్హత కలిగిన సన్న చిన్న కారు పాడి రైతుల నుంచి దరఖాస్తు స్వీకరించి గోకులం షెడ్లు మంజూరు చేయాలన్నారు. సెక్స్ సార్టెడ్ సెమన్ (ఎస్ఎస్ఎస్) ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి చేస్తే 90 శాతం పెయ్యదూడలు పుడుతున్న నేపథ్యంలో దీనిపై రైతుల్లో మరింత అవగాహన పెంచి ప్రోత్సహించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా పశువైద్యసేవలు పకడ్బందీగా నిర్వహించాలని, షెడ్యూల్ వారీగా నట్టల నివారణ, గొంతువాపు, జబ్బువాపు, చిటుకురోగం, దొమ్మరోగం, నీలి నాలుక వ్యాధి తదితర జబ్బులు, వ్యాధుల నివారణకు చేపడుతున్న వ్యాక్సినేషన్ల కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఎలాంటి షూరిటీ లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామని ఎల్‌డీఎం తెలిపారు. అంతకు మించి అయితే మార్ట్‌గేజ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

బోరంపల్లిలో చిరుత సంచారం

కళ్యాణదుర్గం: మండలంలోని బోరంపల్లి గ్రామంలో చిరుత సంచారంపై గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం వేకువజామున బోరంపల్లి నుంచి గంగవరం మార్గంలో ఉన్న ఓ అరటి తోటలో పనులకు బొలెరో వాహనంలో కూలీలు వెళ్తుండగా చిరుత కనిపించింది. వెంటనే కూలీలు సమీపంలో ఉన్న గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కళ్యాణదుర్గం అటవీ శాఖ అధికారులకు ఫోన్లో సమాచారం చేరవేశారు. రెండు రోజుల క్రితం కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని అక్కమాంబ కొండ వద్ద డివైడర్‌ను దాటుతూ వెళ్లినట్లు బోరంపల్లికి చెందిన బొలెరో వాహన డ్రైవర్ రామ్మోహన్ తెలిపారు. అటవీ శాఖ అధికారులు గస్తీ నిర్వహించి జనావాసాల్లోకి అడవి జంతువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపన మేరకు... స్థానిక డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్నమక్బూల్‌బాషాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మూడో కుమారుడు సర్వర్ బాషా(24) అలియాస్ లల్లు ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సర్వర్ బాషా పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్



జీఎల్ఐ డీడీ భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి ఏపీ జీఎల్ఐలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా శాఖ పక్షాన గురువారం ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్‌ను ఆ శాఖ నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. మెచ్యూరిటీ అయిన బాండ్లకు సకాలంలో క్లైయిమ్ సెటిల్‌మెంట్ చేయడం లేదన్నారు. ఆరు నెలలుగా ఉపాధ్యాయుల మెచ్యూరిటీ క్లైయిమ్‌లు ఏపీజీఎల్ఐ ఆఫీస్‌లో మేకర్, చెక్కర్, అప్రూవల్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతనంగా ఏపీ జీఎల్ఐ ప్రీమియం మొత్తాన్ని పెంచినా.. కొత్త బాండ్లను మాత్రం అసంపూర్తిగా జనరేట్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. తప్పిదాలను సరి చేసేందుకు సరైన నిబంధనలు రూపొందించలేదన్నారు. కొత్తగా జారీ చేసిన బాండ్లన్నీ తప్పుల తడకగా ఉన్నాయన్నారు. ఆరు నెలలుగా లోన్లు విడుదల చేయడం లేదన్నారు. మెచ్యూరిటీ క్లైమ్ సెటిల్మెంట్లను, లోన్ ప్రాసెసింగ్ విధానాన్ని మరింత సరళతరం చేయాలన్నారు. జీఎల్ఐ మిస్సింగ్ క్రెడిట్ వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, నాయకులు పి.రవికుమార్, గోపాల్‌నాయక్, ఆంజనేయులు, నాగశేషశయన, కుళ్లాయిరెడ్డి, నాగేంద్ర, నాగరాజు, రఫీ, పుల్లప్ప పాల్గొన్నారు.

మాజీ యానిమేటర్ బైకుకు నిప్పు



కళ్యాణదుర్గం: మండలంలోని దాసంపల్లికి చెందిన మాజీ యానిమేటర్ హరిజన గంగాధర్‌కు చెందిన ద్విచక్ర వాహనానికి దుండగులు నిప్పు పెట్టారు. బుధవారం రాత్రి తన ఇంటి ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లో నిద్రకు ఉపక్రమించిన ఆయన గురువారం తెల్లవారుజామున లేచి చూసే సరికి పూర్తిగా కాలిపోయిన ద్విచక్ర వాహనం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు, చుట్టుపక్కల వారు ఆ చుట్టుపక్కల పరిశీలించారు. పెట్రోల్ తీసుకువచ్చిన ఓ ఖాళీ బాటిల్‌ను గుర్తించి, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యానిమేటర్‌గా పనిచేసిన గంగాధర్ ఆ పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవాడు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నాయకుల వేధింపులు, బెదిరింపులు తాళలేక యానిమేటర్ పదవికి రాజీనామా చేశారు. అయితే ఆయనను ఆర్థికంగా దెబ్బతీయాలన్న కక్షతోనే టీడీపీకి చెందిన వారే ఈ నీచానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి




మృతుడు చిన్న ఓబులేసు

కూడేరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కమ్మూరుకు చెందిన బోయ పెన్నప్పగారి చిన్న ఓబులేసు (70) గురువారం ఉదయం జడివానకు ఇంటి పైకప్పు కారుతుండడంతో పరిశీలించేందుకు మిద్దెపైకి ఎక్కాడు. ఈ క్రమంలో మిద్దెపై కాలు జారడంతో పక్కనే విద్యుత్ సర్వీస్ తీగకు ఏర్పాటు చేసిన పైప్‌ను పట్టుకున్నాడు. అప్పటికే పైప్‌కు విద్యుత్ ప్రసారం జరుగుతుండడంతో షాక్ గురై గవాచీపై పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పక్కింటి వారి సాయంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు తొలగించి ఓబులేసు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం: నగరంలోని రుద్రంపేట సర్వీసు రోడ్డులో ఉన్న ఓ ప్రార్థనా మందిరం సమీపంలో ఉన్న ఇంట్లో వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న వ్యక్తితో పాటు విటుడు, ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు నాల్గో పట్టణ పీఎస్ ఎస్ఐలు అల్లాబకాష్, విజయభాస్కర్ తెలిపారు. శింగనమల మండలం పెరవలి గ్రామానికి చెందిన సుగాలి వరదరాజులు కుమారుడు సుగాలి రాముడు కొంతకాలంగా వ్యభిచారాన్ని నిర్వహిస్తున్నట్లుగా అందిన పక్కా సమాచారంతో గురువారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో విటుడు రాజారెడ్డితో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు.25 రోజులుగా అమ్మాయిలను రప్పిస్తూ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మిగిలిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి



జయరాం (ఫైల్)

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రం గ్రామంలో గురువారం రాత్రి పిడుగుపాటుకు జయరాం(49) అనే వ్యక్తి మృతిచెందాడు. పొలాల్లో ఎనుములను మేపుకుని సాయంత్రం ఇంటికి తోలుకుని వస్తుండగా మార్గం మధ్యలో పిడుగు రాలి అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్ఓ రఘునాథరావు పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. కాగా, మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది.

క్లుప్తంగా

చేతివృత్తిదారులను ఆదుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలవుతున్నా చేతి వృత్తిదారుల సంక్షేమానికి నిధులు ఇవ్వలేదని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.లింగమయ్య విమర్శించారు. చేతి వృత్తిదారులను ఆదుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 22న బీసీ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. గురువారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా కార్పొరేషన్లకు నిధులు ఇవ్వలేదన్నారు. అణగారిన వర్గాల్లో వయసు 50 ఏళ్ల పైబడిన వారికి పింఛన్ ఇస్తామని ఇవ్వలేదన్నారు. చేతివృత్తిదారులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, సీవీ హరికృష్ణ, బంగారు బాషా, గోవిందరాజులు, నాగప్ప, ఆదినారాయణ, ఈశ్వరమ్మ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు సద్వాణి గ్రంథావిష్కరణ

అనంతపురం కల్చరల్: ప్రముఖ సంస్కృత పండితుడు నాగత్రిశూలపాణి సంస్మరణ సభ సందర్భంగా ఈనెల 19న ఆయన రచించిన 'సద్వాణి' గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు సశృతాపాణి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక సాయిబాబా కళాశాల ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

మానసకు ఉమ్మడిశెట్టి జాతీయ అవార్డు



అనంతపురం కల్చరల్: ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ జాతీయ యువ పురస్కారం ఈ ఏడాది యువ ఇంజినీర్, వర్ధమాన కవయిత్రి మానస చామర్తిని ఎంపిక చేశారు. ఈ మేరకు సీనియర్ సాహితీవేత్త డాక్టర్ రాధేయ గురువారం వివరాలు వెల్లడించారు. 2015లో 'పరవశ' పేరుతో యువ రచయిత్రి మానస రచించిన కవితా సంపుటి గొప్ప పేరు తెచ్చుకుందన్నారు. ప్రాచీన ఆధునిక కవిత్వాల్లో నాన్న ప్రధాన వస్తువుగా వచ్చిన వాటిల్లో ఆమె రచన ఎంతో మందిని ఆకట్టుకుందన్నారు. త్వరలో అనంత వేదికగా సాగే పురస్కారాల ప్రదానోత్సవంలో మానసకు రూ.10 వేల నగదు, అవార్డు అందజేస్తామని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



అలంకరణలో దేవసేన, శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్య స్వామి

అనంతపురం కల్చరల్: శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం గురువారం కమనీయంగా సాగింది. నగరంలోని శ్రీ శివబాలయోగి ఆశ్రమంలో పాడ్యమి నుంచి పౌర్ణమి వరకూ కొనసాగుతున్న దసరా ముగింపు వేడుకల్లో గత మూడు రోజులుగా ఆశ్రమంలో కొలువైన వివిధ దేవతామూర్తుల కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఉదయం సుబ్రహ్మణ్య స్వామి పరిణయ వేడుకలు, కల్యాణంలోని వివిధ ఘట్టాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో పార్వతీ పరమేశ్వరులకు రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ హోమాలు తీర్థప్రసాద వితరణ ఘనంగా జరిగాయి. పౌర్ణమి సందర్భంగా ముగింపు ఉత్సవం కావడంతో పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, ప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సునీత, అధికారులు

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు గోకులం షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, ఆర్‌డబ్ల్యూఏఈ వరలక్ష్మి, ఆర్ఐ రాగే కరుణకర్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే భయం.. భయం

- నడిమివంక, మరువ వంకల సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలం
- ముంపు ప్రాంతాల వైపు కన్నెత్తి చూడని ఎమ్మెల్యే దగ్గుపాటి
- తుపాను ప్రభావంతోనే అధికారుల హడావుడి



నడిమివంకలో పూడికతీత పనులు చేపడుతున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరం చుట్టూ ఉన్న నడిమివంక, మరువ వంక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచన చేయకపోగా.. వర్షాలు వచ్చినప్పుడు మాత్రం అధికారులు హడావుడి చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి మూడుసార్లు వర్షాలు వచ్చాయి. వర్షాలు వచ్చినప్పుడల్లా పూడికతీత పనులంటూ అధికారులు హడావుడి చేయడానికి పరిమితం అవుతున్నారు.

రక్షణ గోడలకు చర్యలేవి?

వర్షాలు వస్తే ప్రధానంగా నగరంలోని నడిమివంకకు ఆనుకుని 5, 6వ రోడ్డు, కైలాసం రోడ్డు, సోమనాథ్ నగర్, రంగస్వామి నగర్, రజకనగర్, గౌరవ గార్డెన్, వడ్డే వారి కాలనీలోని ముంపు ప్రాంతాల్లోని ప్రజలు బిక్కు బిక్కుమంటూ ఉండాల్సిందే. వర్షం వచ్చిందంటే ఇళ్లల్లోకి పెద్ద ఎత్తు వర్షపు నీరు చేరుతుంది. ఈ ప్రాంతాల్లో 10 వేల కుటుంబాలు నివాసముంటున్నాయి. 30 వేల నుంచి 50 వేల మంది నివసిస్తున్నారు. వాస్తవంగా గతంలో రక్షణ గోడలకు నిధులు మంజూరు కాగా.. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రక్షణ గోడల నిధులు చెరువుకట్టకు మళ్లించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఎన్నికలు రావడంతో ఆ పనుల్లో జాప్యం జరిగింది. ఇటీవల ఎన్నికలకు ముందు కూడా రక్షణ గోడలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానీ ఆ దిశగా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లోనే అకాల వర్షాలు వచ్చాయి. పూడికతీత పనులు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. కానీ అది మాటలకే పరిమితమైంది. ఇప్పటికీ మూడుసార్లు వర్షాలు వస్తే హడావుడి చేయడం తప్ప శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇటీవల వడ్డే వారి కాలనీ వద్ద ఓ వ్యక్తి వంకకు అడ్డువేస్తే.. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కనీసం పోలీసులను కూడా పంపకుండా చేతులెత్తేశారు. సమస్య సద్దుమనిగాక ఫొటోలకు ఫోజులిచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రక్షణ గోడలను ఏర్పాటు చేస్తే ప్రజలకు భయాందోళన తప్పుతుంది.

మద్యం సిండికేట్‌పైనే ధ్యాస..

వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతుంటే మద్యం సిండికేట్‌పైనే ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు ధ్యాస ఉన్నట్లు తెలుస్తోంది. కనీసం వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించిన దాఖలాలు లేవు. ప్రజలకు కొండంత అండగా ఉంటామని చెప్పడంతో నమ్మకంతో ఓట్లేసిన ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారు. వంకల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పాటు, రక్షణ గోడల ఏర్పాటు విషయంపై ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిని గాలికొదిలేశారు. పూడిక మాయ పేరుతో తెలుగు తమ్ముళ్లు పండుగ చేసుకుంటున్నారు. గతసారి కురిసిన వర్షాలకు పూడికతీత పనులు తూతూమంత్రంగా చేపట్టి రూ.29 లక్షల బిల్లు పెట్టారు. ఈ బిల్లు చేయలేని ఇంజినీర్ ఇక్కడ పని చేయలేం బాబోయ్ అంటూ వెళ్లిపోయారు. ఇప్పుడు పూడికతీత పేరుతో నగరంలో హిటాచీలు, జేసీబీలతో పనులు చేస్తున్నారు. మరువవంక, నడిమివంకకు శాశ్వత పరిష్కారం పక్కన పెడితే తెలుగు తమ్ముళ్ల జేబులను నింపుకోవడానికి ఉపయోగపడుతున్నట్లు తెలుస్తోంది.

సర్వే చేయిస్తాం



నడిమివంక, మరువ వంకకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సమయం పడుతుంది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో వంకలను సర్వే చేసి, ఆక్రమణలను గుర్తిస్తాం. అనంతరం కలెక్టర్ ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నడిమివంక, మరువవంకల్లో పూడికతీత పనులు చేయిస్తున్నాం. మురుగు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు.

– నాగరాజు కమిషనర్, నగరపాలక సంస్థ

మేలుకోని అధికార యంత్రాంగం

నడిమివంక, మరువంక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో జిల్లా అధికార యంత్రాంగమైనా మేలుకోవాల్సి ఉంది. కేవలం వర్షాలు వచ్చినప్పుడు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పర్యటించి, ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక 50 డివిజన్ల పరిధిలోని చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకోవడంలో నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు విఫలమవుతున్నారు. ఇక ప్రధాన సమస్యలపై ఎలా దృష్టి సారిస్తారో అర్థం కావడం లేదు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: లక్ష్మీ పండమేటి వేంకటరమణ స్వామి (పండమేటి రాయుడు) ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెడిపోతుల ఆంజనేయ వెంకట్రాముడు అన్నారు. గురువారం సాయంత్రం ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా రాప్తాడుకు చెందిన చెడిపోతుల ఆంజనేయ వెంకట్రాముడు, వైస్ చైర్మన్‌గా చిల్లర లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవదాయ, టీటీడీ నిధులతో పునర్ నిర్మాణం చేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్‌లో ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కంటే మునుపే ఇక్కడ వెంకట రమణ స్వామి స్వయంభుగా కొలువుదీరినట్లు పూరాణాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. స్వామికి రాప్తాడుతో పాటు అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, కర్ణాటక, బెంగళూరు తదితర ప్రాంతాల్లో కాపులు అధికంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు సాకే నారాయణ స్వామి, సాకే జయరాముడు, తలారి నాగరాజు, పామాళ్ల కొటేశ్వర, గంజి ఇటుకునల్లప్ప, జూటూరు రామకృష్ణ, గంటా శ్రీరాములు, కోట్లో ఆంజనేయులు, చలపతి, ఉప్పరపల్లి రాముడు, నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీచర్లకు మండలస్థాయిలో శిక్షణ ఇవ్వాలి



డీఈఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: 1, 2 తరగతులు బోధించే టీచర్లకు ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతులు జిల్లాస్థాయిలో కాకుండా మండలస్థాయిలో ఇచ్చేలా పరిశీలించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. టీచర్లకు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యతలను చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతారన్నారు. రిసోర్స్‌పర్సన్లకు ముందుగా శిక్షణ ఇచ్చి, వారి ద్వారా మండలస్థాయిలో గాని లేదా రెండు మూడు మండలాలకు కలిపి గాని శిక్షణ ఇచ్చేలా చూడాలని కోరారు. శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, నాయకులు వన్నప్ప, రంగనాయకులు, సూర్యనారాయణ, తిప్పేస్వామి ఉన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా?



మాట్లాడుతున్న వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి

ఆత్మకూరు: ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ప్రజలు తమకు ఓట్లు వేసి గెలిపిస్తే ప్రోటోకాల్ పాటించకపోతే ఎలా అని ప్రశ్నించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఏ కార్యక్రమం జరిగినా ప్రోటోకాల్ ప్రకారం సర్పంచులు, ఎంపీటీసీలకు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఏఈ జమీల్ అహమ్మద్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను నిర్మించుకోవాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ ఏఈ దాస్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్ స్తంబాల కింద ఉండరాదని తెలిపారు. వర్షం ఎక్కువ కావడంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అందరం అభివృద్ధికి పాడుపడుదామని వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి అధికారులను కోరారు. ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి మాట్లాడుతూ.. ఆత్మకూరులో ఎస్సీ కాలనీ, ఆర్టీటీ క్రీడా మైదానం వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎస్సీ కాలనీలోకి నీరు రాకుండా వంకలో జేసీబీతో పూడిక తీసి వర్షపు నీరు వెళ్లేలా చేస్తున్నామన్నారు. నీరు ఇళ్లలోకి వెళ్లకుండా యంత్రాల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్‌కుమార్ నాయక్, ఈఓఆర్డీ కామక్క, ఏఓ సుచరిత, ఏపీఓ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి, డాక్టర్ సబిహా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసిన డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం అగ్రికల్చర్/ఆత్మకూరు/రాప్తాడు/అనంతపురం మెడికల్/అనంతపురం: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ అనంతపురం, జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయంలో వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. ఆత్మకూరు మండలం సింగంపల్లి, వై.కొత్తపల్లి గ్రామాల్లో, రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ పి.జగదీష్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ, జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ బి.అనిత, జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి షఫీ, వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయశాఖ జేడీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూజలు



ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లిలో బోనాల ఊరేగింపు



రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో..



మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎస్పీ జగదీష్

తుపాను దెబ్బకు రైతుల విలవిల



ఆత్మకూరు వద్ద వర్షాలకు తడిసిన వేరుశనగను పరిశీలిస్తున్న ఏఓ సుచరిత, ఏఈఓ సుజాత

రాప్తాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. మండలంలో సాగుచేసిన వేరుశనగ, టమాట, మొక్కజొన్న, ఆముదం, కంది, వరి తదితర పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,854 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. సాగు ఆరంభంలో వర్షాలు విస్తారంగా కురిసినా ఉడలు దిగే సమయంలో వరుణుడు ముఖం చాటేశారు. దీంతో చెట్టుకు కాచిన రెండు, మూడు కాయలు, మినహా మిగిలిన కాయలన్ని లోత్తాగా పడిపోయాయి. కనీసం పశుగ్రాసమైన దక్కతుందనే ఆశతో వేరుశనగ పంట తొలగింపులో రైతులు నిమగ్నమయ్యారు. తుపాన్ దెబ్బకు వేరుశనగ కాయలు దెబ్బతినడంతో పాటు పశుగ్రాసం పూర్తిగా పనికి రాకుండా పోతోందని పలువురు రైతులు చెబుతున్నారు. పంట తొలగించిన తర్వాత వర్షం వస్తే ప్రభుత్వం రైతులకు ఎటువంటి పరిహారం మంజూరు చేయదని రాప్తాడు ఏఓ శేఖర్ రెడ్డి తెలిపారు. తుపాను తీవ్రత తగ్గే వరకూ వేరుశనగ పంటను తొలగించొద్దని సూచించారు.

ఆత్మకూరు: 'వదలని వాన.. రైతుల ఆందోళన' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి మండల వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. గురువారం మండల వ్యవసాయ అధికారి సుచరిత, ఏఈఓ సుజిత ఆత్మకూరు రైతులతో కలసి వర్షాలకు తడిసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా దెబ్బతిన్న వేరుశనగ పంట వివరాలను జిల్లా ఉన్నత అధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. తుపాను నేపథ్యంలో రైతులు పంటను తొలగించరాదని తెలిపారు. కార్యక్రమంలో రైతులు గూలి కొండారెడ్డి, కనికిరెడ్డి కొండారెడ్డి, సచివాలయ సిబ్బంది నరసింహ పాల్గొన్నారు.

రూ.60 వేలు నష్టపోయాం



పంటను సకాలంలో సాగు చేసినప్పటికి, పంట చేతి కందే సమయంలో వర్షం లేక దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. చెట్టుకు కాచిన రెండు, మూడు కాయలు, పశుగ్రాసమైనా దక్కుతుందన్నా ఉద్దేశంతో పంటను తొలగించాం. కానీ తుపాను వల్ల ఆ ఆశలన్నీ నీరుగారిపోయాయి. 3 ఎకరాల్లో సాగు చేసిన పంటంతా వర్షానికి తడిసి ముద్దయిపోయింది. దాదాపుగా రూ.60 వేలు నష్టపోయాం.

– తలారి లక్ష్మమ్మ, రైతు, రాప్తాడు

21న కలెక్టరేట్ ఎదుట సీపీఎం మహాధర్నా

అనంతపురం అర్బన్: తాగు, సాగునీటి సమస్య పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ధర్నా పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. పాలకులకు మద్యంపై ఉన్న శ్రద్ధ, రైతుల సంక్షేమంపై లేదని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి వృథాగా పోతున్న నీటిని ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, ఎర్రిస్వామి, ప్రసాద్, వెంకటేశు, గఫూర్, జీవ, నూరుల్లా పాల్గొన్నారు.

వర్షాలకు నేలమట్టమైన ఇల్లు

ఆత్మకూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆత్మకూరు మండలం పంపనూరు తండాలో ఓ పురాతన మిద్దె ఇల్లు కూలింది. ఆ ఇంట్లో నివాసముంటున్న వృద్ధురాలు మంగమ్మ నాలుగు రోజుల క్రితం తాళం వేసి అనంతపురంలో నివాసముంటున్న కుమారుడి వద్దకెళ్లింది. ఇల్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు.

ఎస్ఆర్ఐటీకి మల్టిపుల్ బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు



అవార్డు చూపుతున్న కళాశాల సిబ్బంది

శింగనమల: ఢిల్లీలో జరిగిన ఎడ్యుస్కిల్స్ కనెక్ట్ -24 కార్యక్రమంలో రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ కళాశాల ఆలిండియా 4వ ర్యాంక్ సాధించి మల్టిపుల్ బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును సాధించినందుకు కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ టీపీఓ అవార్డును డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులైన సిలోనీస్ పి.వీర కాష్, పాలో ఆల్టోకు డాక్టర్ పి.చిత్రలింగప్ప, జెడ్ స్కేల్‌కు డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, బ్లూప్రిజంకు ఎల్.సుమన్, యు.ఐ. పాత్‌కు సి.సుధీర్‌కుమార్ ఉత్తమ మార్గ నిర్దేశకులుగా అవార్డులను గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ అవార్డు కళాశాల అందించే నాణ్యమైన విద్యకు నిదర్శనమన్నారు.

విజయసాయికి అవార్డు



విజయసాయిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: సాయి ట్రస్టు కౌన్సెలర్లుగా ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి అందిస్తున్న సేవలకు గాను ఆ ట్రస్టు నిర్వాహకుడు విజయసాయికి ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎన్ రావు ఉత్తమ అవార్డు అందజేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విజయసాయిని అభినందించారు. విజయసాయి మాట్లాడుతూ 2015 నుంచి సాయి ట్రస్టు ద్వారా ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి వందలాది మంది మృతుల కుటుంబాలతో నేత్రదానం చేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముందుందు అదే తరహాలో సేవలందిస్తామని పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మాదక ద్రవ్యాల నుంచి యువత తమను రక్షించుకోవడానికి జాగ్రత్తగా మెలగాలని వక్తలు సూచించారు. నెహ్రూ యువకేంద్రంలో గురువారం మాదక ద్రవ్యాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎస్‌వైకేతో పాటూ ప్రగతి పథం, ఎస్ఆర్ ఎడుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆచార్య మురళీధరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ జీవీఎల్ఎన్ ప్రసాద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి భరత్, జీవన్‌కుమార్, జయమారుతి, డాక్టర్ గరుగు బాలాజీ, నెహ్రూ యువకేంద్ర డీడీవో గోవర్ధన్ శ్రీనివాసులు తదితరులు విచ్చేసి మాట్లాడారు. సమాజంలో ఎన్నో రకాల మత్తు పదార్థాలు వ్యసనంగా మారేస్తున్నాయని యువత సమాజంలో వీటిపై సమగ్రంగా అవగాహన కల్పించాలని వక్తలన్నారు. అంతకు ముందు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేశారు. యువ వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పవన్ గణేష్, నందిత, ఫ్రెసిలా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అనంతపురం: నగరంలో రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. సంగమేష్ సర్కిల్ పరిధిలో నివసిస్తున్న నారాయణప్ప (68) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.